గురువారం 01-08-2024

# ముందడుగు

దినపత్రిక

సంపుటి: 1, సంచిక: 411 పేజీలు: 4 | ₹6


EPAPER.MUNDADUGU.COM

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచెయొచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp:
9491114616


email: mundadugu111@gmail.com



పూజా ఖేడ్కర్‌పై యూపీఎస్సీ

## కీలక నిర్ణయం

మిగతా 2లో



## యజమానితో తీర్థయాత్రలకు వెళ్లి తప్పిపోయిన కుక్క

మిగతా 3లో



## సినిమా కోసం గొడవపడ్డా!

మిగతా 4లో



## ఆ హీరోయిన్‌కి దిష్టి తగులుతుంది

మిగతా 5లో

# తెలంగాణ గవర్నర్‌గా జిష్ణుదేవ్ వర్మ ప్రమాణం

## హజరైన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు



ముందడుగు తెలంగాణ: తెలంగాణ రాష్ట్ర నూతన గవర్నర్‌గా జిష్ణుదేవ్ వర్మ ప్రమాణం చేశారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే.. ఆయనతో ప్రమాణం చేయించారు. రాజ్‌భవన్‌లో జరిగిన గవర్నర్ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, సీఎస్ శాంతి కుమారి తదితరులు హాజరయ్యారు.

1957 ఆగస్టు 15న జన్మించిన జిష్ణుదేవ్ వర్మ.. త్రిపుర రెండో ఉప ముఖ్యమంత్రిగా 2018 నుంచి 2023 వరకు పని చేశారు. బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడిగానూ సేవలందించారు. ఆయన త్రిపుర రాజ కుటుంబానికి చెందిన వ్యక్తి. రామ జన్మభూమి ఉద్యమ సమయంలో 1990లో భాజపాలో చేరారు. తెలంగాణ భాజపా నేత ఇంద్రసేనారెడ్డి త్రిపుర గవర్నర్‌గా నియమితులుకాగా, ఆ రాష్ట్రానికి చెందిన నాయకుడు తెలంగాణ గవర్నర్‌గా రావడం విశేషం.

# కోచింగ్ సెంటర్ల నియంత్రణకు కొత్త చట్టాలు

## ఒక కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటన

రెవెన్యూ శాఖ మంత్రి అతిశీ వెల్లడి



ముందడుగు ఢిల్లీ: ఢిల్లీలోని ఓ కోచింగ్ సెంటర్ నిర్లక్ష్యం కారణంగా బేస్‌మెంట్‌లో వరద నీరు రావడంతో ముగ్గురు సివిల్స్ విద్యార్థులు మృతిచెందిన విషయం తెలిసిందే. దీంతో రాష్ట్రంలోని కోచింగ్ సెంటర్ల నియంత్రణకు కొత్త చట్టాలను రూపొందించాలని దిల్లీ ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా ఒక కమిటీని ఏర్పాటుచేయనున్నట్లు రెవెన్యూ శాఖ మంత్రి అతిశీ పేర్కొన్నారు. ఈ కమిటీలో అధికారులతో పాటు విద్యార్థులు సైతం భాగస్వాములవుతారని తెలిపారు.

చట్టాలను ఉల్లంఘిస్తూ బేస్‌మెంట్లను కోచింగ్ సెంటర్లుగా ఉపయోగిస్తున్న వారిపై మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ దిల్లీ కఠినంగా వ్యవహరిస్తోందన్నారు. రాజేంద్రనగర్, ముఖర్జీనగర్, లక్ష్మీనగర్, ప్రీతి విహార్‌లోని 30 కోచింగ్ సెంటర్ల బేస్‌మెంట్‌లను సీజ్ చేశామన్నారు. మరో 200 కోచింగ్ సెంటర్లకు నోటీసులు జారీ చేసినట్లు ఆమె వెల్లడించారు. రాజేంద్రనగర్ ఘటనలో అధికారులు దోషులుగా తేలితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

# బిఆర్ఎస్ రాష్ట్రవ్యాప్త ఆందోళనలకు పిలుపు

## సీఎం వ్యాఖ్యలను ప్రతి ఒక్కరూ ఖండించాలి ▪ బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్

ముందడుగు తెలంగాణ: తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సీనియర్ మహిళా శాసనసభ్యులు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిపై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా రాష్ట్ర వ్యాప్త ఆందోళనలకు భారాస పిలుపునిచ్చింది. తెలంగాణ సంస్కృతిలో ఆడబిడ్డలకు ప్రత్యేక గౌరవం, స్థానం ఉందన్న కనీస సోయి లేకుండా ఆడబిడ్డలపై సీఎం చేసిన వ్యాఖ్యలను ప్రతి ఒక్కరూ ఖండించాల్సిన అవసరముందని బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. సుదీర్ఘ కాలం పాటు ప్రజల మన్ననలు



అందుకుంటూ కార్యకర్తల ఆశీర్వాదం, అనేక త్యాగాలతో ప్రజలకు సేవ చేస్తున్న ఇద్దరు సీనియర్ మహిళా సభ్యులపై అహంకారంతో రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు తెలంగాణ ఆడబిడ్డలందరి మనసులను నొప్పించాయని ఆవేదన వ్యక్తం చేశారు. జీవితంలో ఎదగాలని అనుకుంటున్న ప్రతి ఒక్క మహిళ, ఆడబిడ్డకు ఈ వ్యాఖ్యలు అవమానకరమని కేటీఆర్ అన్నారు. అధికారం, అహంకారంతో రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను తెలంగాణ సమాజమంతా ముక్తకంఠంతో ఖండించాల్సిన అవసరం ఉందని తెలిపారు. రేవంత్ రెడ్డి వెంటనే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకొని అసెంబ్లీ సాక్షిగా తెలంగాణ ఆడబిడ్డలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

# అత్యాచారం కేసులో నిందితుడికి మరణదండన


## తీర్పును సమర్ధించిన హైకోర్టు

ముందడుగు తెలంగాణ: హైదరాబాద్ నగరంలోని నార్సింగిలో నాలుగున్నరేళ్ల బాలికపై అత్యాచారం, హత్య కేసులో దోషికి హైకోర్టు మరణ దండన విధించింది. 2018లో నార్సింగిలో చిన్నారిపై సెంట్రింగ్ కార్మికుడు దినేశ్ కుమార్ కిరాతకానికి ఒడిగట్టిన ఘటన అప్పట్లో తీవ్ర సంచలనం రేపింది. ఈ కేసులో నిందితుడికి రంగారెడ్డి కోర్టు 2021లో ఉరిశిక్ష విధించగా.. ఆ తీర్పును అతడు హైకోర్టులో సవాల్ చేశాడు. అతడి పిటిషన్‌పై విచారణ జరిపిన ఉన్నత న్యాయస్థానం.. కింది కోర్టు ఇచ్చిన తీర్పు సరైందేనని సమర్ధించింది.

ముందడుగు
గురువారం, 01-08-2024, హైదరాబాద్

# మా విద్యార్థులను కోల్పోవడం బాధాకరం

## విద్యార్థుల మరణాలపై రావూస్ అకాడమీ స్పందన




ముందడుగు ఢిల్లీ:
ఢిల్లీలోని రావూస్ కోచింగ్ సెంటర్ నిర్లక్ష్యం కారణంగా బేస్‌మెంట్‌లో వరదనీరు రావడంతో ముగ్గురు సివిల్స్ విద్యార్థులు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై రావూస్ అకాడమీ తొలిసారి స్పందించింది. మృతులకు నివాళులర్పిస్తూ ఓ ప్రకటనను విడుదల చేసింది. 'వారి కలలు, అంకితభావం ఎప్పటికీ గుర్తుండిపోతాయి. మా విద్యార్థులను కోల్పోవడం బాధాకరం. వారి కుటుంబాలకు మా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాం. ఈ ఘటనకు సంబంధించి కొనసాగుతున్న విచారణకు పూర్తిగా సహకరిస్తాం' అని పేర్కొంది.
ఈ ఘటనలో అరెస్టయిన ఎస్‌యూవీ డ్రైవర్ మను కతురియా, భవన యజమానులు పర్వీందర్ సింగ్, సర్వజిత్ సింగ్, హర్విందర్ సింగ్, తేజేందర్ సింగ్‌లకు ఢిల్లీ కోర్టు బెయిల్ నిరాకరించింది. అయితే కతురియా తన అరెస్టుని సవాల్ చేస్తూ వేసిన పిటిషన్‌పై రేపు విచారణ జరగనుంది. కతురియా భార్య సీమా కతురియా ఈ ఘటనలో తన భర్తది ఎటువంటి తప్పూ లేదన్నారు. ఇది పూర్తిగా కోచింగ్ సెంటర్ నిర్లక్ష్యమేనని ఆరోపించారు.

# వయనాడ్ సహాయ నిధికి భారీ విరాళాలు

## ఆదానీ గ్రూపు, విక్రమ్ విరాళాలు ప్రకటన

ముందడుగు జాతీయం:
కేరళ రాష్ట్రం వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడిన ఘటనలో దాదాపు 180 మందికి పైగా మృతిచెందిన ఘటన యావత్ దేశాన్ని కలిచి వేస్తోంది. ఈ క్రమంలో బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు ప్రభుత్వం పాటు దేశవ్యాప్తంగా పలువురు ప్రముఖులు ముందుకు వస్తున్నారు.
వయనాడ్ విషాదంపై అదానీ గ్రూప్ తీవ్ర విచారం వ్యక్తం చేసింది. ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబసభ్యులకు ప్రముఖ పారిశ్రామిక వేత్త గౌతమ్ అదానీ ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. ఇలాంటి సమయంలో కేరళ ప్రజలకు అదానీ గ్రూప్ అండగా నిలబడుతుందని అన్నారు. బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు రూ.5 కోట్ల విరాళం ప్రకటించారు.
అదానీ గ్రూప్‌తో పాటు, ఆర్పీ గ్రూప్ రవి పిళ్లై, లూలు గ్రూప్ ఇంటర్నేషనల్ ఛైర్మన్ ఎం.ఎ.యూసఫ్ అలీ, కల్యాణ్ జువెలర్స్ ఛైర్మన్ ఎండీ టి.ఎస్.కల్యాణరామన్‌లు



కూడా ఒక్కొక్కరూ రూ.5కోట్ల విరాళాన్ని సీఎం సహాయనిధికి అందిస్తున్నట్లు ప్రకటించారు. వయనాడ్ ఘటనపై నటుడు విక్రమ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలను ఆదుకునేందుకు సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.20లక్షలు విరాళంగా ఇస్తున్నట్లు ప్రకటించారు. మరోవైపు మలయాళ చిత్ర పరిశ్రమ వయనాడ్ ఘటనపై విచారం వ్యక్తం చేసింది. కొన్ని రోజుల పాటు సినిమా ఫంక్షన్లు, కార్యక్రమాలు నిలిపివేస్తున్నట్లు పలు చిత్ర బృందాలు ప్రకటించాయి.

# తుపాకీతో స్కూల్‌కి వెళ్లిన నర్సరీ బాలుడు

## మరో విద్యార్థిపై కాల్పులు, తీవ్ర గాయాలు

ముందడుగు బీహార్:
తుపాకీతో స్కూల్‌కి వెళ్లిన ఐదేళ్ల బాలుడు, మరో విద్యార్థిపై కాల్పులు జరిపాడు. తీవ్ర గాయాలపాలైన బాధితుడిని ఆస్పత్రికి తరలించడంతో ప్రాణాపాయం తప్పింది. ఈ ఘటన బీహార్ సుపాల్ జిల్లాలోని ఒక పాఠశాలలో చోటు చేసుకొంది. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. నర్సరీ చదువుతున్న ఐదేళ్ల పిల్లవాడు తుపాకీని బ్యాగులో పాఠశాలకు తీసుకెళ్లాడు. మూడో తరగతి చదువుతున్న మరో విద్యార్థిపై కాల్పులు జరిపాడు. దీంతో ఆ చిన్నారి తీవ్రంగా గాయపడ్డాడు. రక్తస్రావం కావడంతో ఆస్పత్రికి తరలించారు. బాలుడికి ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. తమ చిన్నారుల భద్రతపై బాలల తల్లిదండ్రులు పాఠశాల ముందు ఆందోళన వ్యక్తం చేశారు. సమాచారం




అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన స్కూల్ ప్రిన్సిపల్‌ను అరెస్టు చేశారు. అసలు పిల్లాడి చేతికి తుపాకీ ఎలా వచ్చిందన్న కోణంలో దర్యాప్తు చేపట్టారు. బాలుడి తండ్రి కోసం వెతుకుతున్నట్టు తెలిపారు. ఈ క్రమంలోనే విద్యార్థుల బ్యాగులను క్షుణంగా తనిఖీ చేసిన లోనికి అనుమతించాలని జిల్లాలోని అన్ని పాఠశాలలను ఆదేశించనున్నట్టు సమాచారం.

# రెడ్‌మి ప్యాడ్ ప్రో మరియు రెడ్‌మి ప్యాడ్ ఎస్ఇ 4G విడుదల



ముందడుగు హైదరాబాద్:
టెక్నాలజీ మరియు ఇన్నోవేషన్‌లలో ప్రపంచ నాయకుడు షవోమీ, రెడ్ మి ప్యాడ్ ప్రో 5G మరియు రెడ్ మీ ప్యాడ్ SE 4G అనే రెండు కొత్త మోడళ్లను రెడ్‌మీ ప్యాడ్ సిరీస్‌కి అనుబంధంగా విజయవంతమైన తన టాబ్లెట్ విగానికి పరిచయం చేసేందుకు హర్షా న్ని వ్యక్తం చేస్తోంది. దీనికి మరింత ఉత్సాహాన్ని జోడిస్తూ, షవోమీ తన ఇటీవలి షవోమీ 14 CIVI కోసం పరిమిత పాండా ఎడిషన్‌ను మూడు ఆకర్షణీయమైన పాప్ రంగులలో విడుదల చేసింది: పాండా వైట్, హాట్ పింక్ మరియు ఆక్వా బ్లూ. షవోమీ 14 CIVI #PandaDesign ఎడిషన్ చిక్ మరియు ప్లేఫుల్ ఖచ్చితమైన మిక్స్‌ని అందిస్తుంది. దాని సొగసైన బ్లాక్ మిర్రర్ గ్లాస్ మరియు విలాసవంతమైన వేగన్ లెదర్‌తో, ఇది కేవలం స్మార్ట్‌ఫోన్ కన్నా ఎక్కువ-ఇది జీవనశైలి అందించే అప్‌గ్రేడ్ అని చెప్పవచ్చు.

# పూజా ఖేడ్కర్‌పై యూపీఎస్సీ కీలక నిర్ణయం

- నియామక పరీక్షలు రాయకుండా డిబార్
- ప్రొవిజినల్ అభ్యర్థిత్వాన్ని రద్దు

ముందడుగు జాతీయం:
ప్రొబేషనరీ ఐఏఎస్ అధికారిణి పూజా ఖేడ్కర్‌పై అవినీతి ఆరోపణల వ్యవహారంలో యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కీలక నిర్ణయం తీసుకుంది. ఆమె ప్రొవిజినల్ అభ్యర్థిత్వాన్ని రద్దు చేసింది. అంతేగాక, భవిష్యత్తులో మళ్లీ నియామక పరీక్షలు రాయకుండా డిబార్ చేసింది. ఈమేరకు అధికారులు బుధవారం వెల్లడించారు.

పుణెలో ట్రైనీ సహాయ కలెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న సమయంలో పూజా ఖేడ్కర్‌పై అధికార దుర్వినియోగంతో పాటు యూపీఎస్సీలో తప్పుడు అఫిడవిట్ పత్రాలు సమర్పించారనే ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. దీంతో ఈ వ్యవహారంపై యూపీఎస్సీ దర్యాప్తు చేపట్టింది. ఈ క్రమంలోనే ఆరోపణలపై వివరణ ఇవ్వాలంటూ ఖేడ్కర్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. దీనికి ఆమె నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో చర్యలు తీసుకున్నట్లు కమిషన్ పేర్కొంది. 'జులై 25లోగా నోటీసులకు సమాధానం ఇవ్వాలని ఆదేశించాం. కానీ, ఆమె ఆగస్టు 4 వరకు గడువు కావాలని కోరింది. ఇందుకు తిరస్కరించి.. జులై 30 వరకు



అదనపు సమయం కల్పించాం. ఇదే చివరి అవకాశమని.. ఎలాంటి పొడిగింపులు ఉండవని స్పష్టంచేశాం. కానీ, ఆమె గడువులోగా తమ సమాధానాన్ని సమర్పించలేదు. అందువల్ల సివిల్ సర్వీసెస్ ఎగ్జామ్-2022లో ఆమె ప్రొవిజినల్ అభ్యర్థిత్వాన్ని రద్దు చేస్తున్నాం. భవిష్యత్తులో కమిషన్ నిర్వహించే నియామక పరీక్షలు/ఎంపికలకు హాజరుకాకుండా శాశ్వతంగా డిబార్ చేస్తున్నాం'' అని యూపీఎస్సీ ఓ ప్రకటనలో వెల్లడించింది.

ముందడుగు
గురువారం, 01-08-2024, హైదరాబాద్

### సమయానికి జాకెట్ కుట్టని టైలర్

## రూ. 15 వేల ఫైన్ వేసిన వినియోగదారుల ఫోరం




ముందడుగు మహరాష్ట్ర:
అడ్వాన్స్ చెల్లించినా సకాలంలో బ్లౌజ్ కుట్టకపోవడంతో ఓ దర్జీకి పెద్ద దెబ్బ తగిలింది. లేడీ టైలర్ రూ. 15,000 జరిమానా చెల్లించవలసి వచ్చింది. అంతేకాదు శిక్ష కింద బ్లౌజ్‌ను ఉచితంగా కుట్టి ఇవ్వాల్సి వచ్చింది. వినియోగదారుల ఫోరం విధించింది. ఈ ఘటన మహారాష్ట్ర ధారశివ్‌లో చోటుచేసుకుంది. జనవరి 2023లో ఫిర్యాదుదారు స్వాతి ప్రశాంత్ కస్తూరే నగరంలోని.. టైలర్ నేహా సంత్‌కు రెండు వర్క్ బ్లౌజ్‌లను ఇచ్చింది. ఇందుకోసం మొత్తం రూ.6 వేల 300 బిల్లు అవుతుందని చెప్పగా... రూ.3 వేలు అడ్వాన్స్ కూడా చెల్లించింది స్వాతి. కానీ నేహా సంత్ అడ్వాన్స్ మొత్తం తీసుకున్నా చెప్పిన సమయానికి స్వాతికి బ్లౌజ్‌లు ఇవ్వలేదు. స్వాతి... నేహాను ఫోన్ ద్వారా పలుమార్లు సంపద్రించింది. మెసేజులు చేసింది. అయినా కూడా నో రెస్పాన్స్. ఇక లాభం లేదని భావించి.. 28 ఏప్రిల్ 2023న స్వాతి వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార ఫోరమ్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో కన్జూమర్ ఫోరం నేహాకు నోటీసులు జారీ చేసింది. అయితే ఆ నోటీసుపై స్పందించకుండా నేహా సంత్ విచారణకు గైర్హాజరయ్యారు. అందువల్ల, వినియోగదారుల ఫోరమ్ 15 జూలై 2024న ఏకపక్షంగా ఉత్తర్వులు జారీ చేసింది. నేహా సంత్ రూ. 15,000 జరిమానాను స్వాతి కస్తూరేకు చెల్లించాలని ఆదేశించింది. శిక్షగా స్వాతి బ్లౌజ్‌ని ఉచితంగా కుట్టించాలని కూడా నేహాకు ఆదేశాలు వచ్చాయి.

### యజమానితో తీర్థయాత్రలకు వెళ్లి


# తప్పిపోయిన కుక్క

### 250 కిలోమీటర్లు ప్రయాణించి ఇంటికి చేరింది



ముందడుగు కర్ణాటక:
కర్ణాటకలోని బెలగావి యమగర్ని గ్రామానికి చెందిన కమలేష్ కుంభార్ ఇంట్లో 'మహారాజ్' అనే పెంపుడు కుక్క ఉంది. ప్రతి ఏటా ఆయన భక్తులతో కలిసి దక్షిణ మహారాష్ట్రలోని పంఢర్‌పూర్‌కు కాలినడకన తీర్థయాత్రగా వెళ్తుంటాడు. ఈసారి పెంపుడు కుక్క కూడా అతడిని అనుసరించింది. జూన్‌లో సుమారు 250 కిలోమీటర్లు నడిచిన కుమలేష్ బృందం మహారాష్ట్రలోని విఠోబా ఆలయానికి చేరుకుంది. అయితే పాండురంగ స్వామి దర్శనం తర్వాత పెంపుడు కుక్క 'మహారాజ్' తప్పిపోయింది. దీంతో కమలేష్ ఆందోళన చెందాడు. తన కుక్క కోసం అక్కడంతా వెతికాడు. మరో గుంపుతో కలిసి అది వెళ్లినట్లు కొందరు వ్యక్తులు చెప్పారు. దీంతో జూన్ 14న కమలేష్ తన ఇంటికి చేరుకున్నాడు. మరోవైపు ఆ మరునాడు పెంపుడు కుక్క తన యజమాని ఇంటికి చేరుకుంది. తోక ఊపుతూ ఇంటి ముందున్న 'మహారాజ్'ను చూసి కమలేష్ కుంభార్ ఆనందం పట్టలేకపోయాడు.
ఒంటరిగా 250 కిలోమీటర్లు ప్రయాణించి మహారాష్ట్ర నుంచి కర్ణాటకలోని తన గ్రామానికి అది చేరుకోవడం చూసి ఆశ్చర్యపోయాడు. పాండురంగ నాథుడే ఆ కుక్కకు దారి చూపి తన ఇంటికి చేర్చినట్లు భావించాడు. 'మహారాజ్' మెడలో పూల దండ వేసి హారతి ఇచ్చి తన ఇంట్లోకి స్వాగతం పలికాడు. అంతేగాక గ్రామస్తులకు విందు కూడా ఇచ్చాడు.

## సినిమాలోని పెద్ద ఇతివృత్తాలలో ఇది ఒకటి



ముందడుగు హైదరాబాద్:
వెస్ బాల్ ప్లానెట్ ఆఫ్ ది ఏప్స్ గ్లోబల్ ఎపిక్ ఫ్రాంచైజీకి కింగ్‌డమ్ ఆఫ్ ది ప్లానెట్ ఆఫ్ ది ఏప్స్‌తో కొత్త జీవితాన్ని అందించాడు. ఇది సీజర్ పాలన అనంతరం అనేక తరాల తర్వాత జరిగిన కథ. ఈ యుగంలో, కోతులు సామరస్యపూర్వకంగా జీవిస్తున్న ఆధిపత్య జాతులు. అయితే మానవులు నీడలో నివసించే స్థితికి చేరుకుంటారు. ఒక కొత్త నిరంకుశ కోతి నాయకుడు తన సామ్రాజ్యాన్ని నిర్మించినప్పుడు, ఒక యువ కోతి భయంకరమైన ప్రయాణాన్ని ప్రారంభించింది. గతం గురించి తనకు తెలిసిన ప్రతిదాన్నీ ప్రశ్నిస్తుంది. కోతుల మరియు మానవుల కోసం భవిష్యత్తును నిర్వచించే ఎంపికలను చేస్తుంది. ఆగస్టు 2న డిస్నీ+ హాట్‌స్టార్‌లో ఇది ప్రసారం కానుంది. అద్భుతమైన ఫ్రాంచైజీలోని ఈసారి వీక్షకులను ఉత్తేజపరిచే, ఆకట్టుకునే ఎపిక్ గాథను కొనసాగిస్తుంది. ఈ సినిమా ఇంగ్లీష్, హిందీ, తమిళం, తెలుగు భాషల్లో ప్రసారం అవుతుంది.

### ఉద్వేగభరితమైన కథ

# ఫ్రీడమ్ ఎట్ మిడ్ నైట్

ముందడుగు హైదరాబాద్:
డొమినిక్ లాపియర్ మరియు లారీ కాలిన్స్ రచించిన మరియు విమర్శకుల ప్రశంసలు పొందిన పుస్తకం ఆధారంగా రూపొందించబడిన ఈ ఉత్కంఠభరితమైన కథ యొక్క మొదటి అధ్యాయాన్ని మీముందుకు తీసుకువస్తున్నాము. సోనీ LIVలో త్వరలో ప్రసారం కానున్న ఈ కథ స్టూడియోనెక్స్ట మరియు సోనీ LIVతో కలిసి ఎమ్మే ఎంటర్‌టైన్‌మెంట్ (మోనిషా అద్వానీ మరియు మధు భోజ్వానీ) నిర్మించారు, నిఖిల్ అద్వానీ షోరన్నర్ మరియు డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. అభినందన్ గుప్తా, అద్వితీయ కరేంగ్ దాస్, గుందీప్ కౌర్, దివ్య నిధి శర్మ, రేవంత సారాభాయ్ మరియు ఏతాన్ టేలర్ ఈ కథను రచించారు.




ఈ ధారావాహికలో జవహర్‌లాల్ నెహ్రూగా సిధాంత్ గుప్తా, మహాత్మా గాంధీగా చిరాగ్ వోహ్రా, సర్దార్ వల్లభాయ్ పటేల్‌గా రాజేంద్ర చావ్లా, ముహమ్మద్ అలీ జిన్నాగా ఆరిఫ్ జకారియా, ఫాతిమా జిన్నాగా ఇరా దూబే, సరోజినీ నాయుడుగా మలిష్కా మెండోన్సా, లిఖ్వత్ అలీ ఖాన్ గా రాజ్‌కుమార్, వి.పి. మీనన్ పాత్రలో కె.సి. శంకర్, లార్డ్ లూయిస్ మౌంట్‌బాటన్‌గా ల్యూక్ మెక్‌గిబ్నీ, లేడీ ఎడ్వినా మౌంట్‌బాటెన్‌గా కార్డెలియా బుగేజా, ఆర్కిబాల్డ్ వేవెల్‌గా అలిస్టర్ ఫిన్లే, క్లెమెంట్ అట్లీగా ఆండ్రూ కల్లమ్, సిరిల్ రాడ్‌క్లిఫ్‌గా రిచర్డ్ టెవర్సన్ వంటి ప్రముఖ తారాగణం కీలక పాత్రల్లో నటించారు.

ముందడుగు
గురువారం, 01-08-2024, హైదరాబాద్

# రాబోయే భవిష్యత్తు అంతా ఎలక్ట్రిక్ వాహనాలదే


## హైదరాబాద్‌లో ప్రారంభమైన ఫ్యూచర్ ఎలక్ట్రిక్ సదస్సు



ముందడుగు హైదరాబాద్: సస్టైనబుల్ ఎనర్జీ అండ్ ఫ్యూచర్ ఎలక్ట్రిక్ ట్రాన్స్‌పోర్టేషన్ పై ఐఈఈఈ 4వ అంతర్జాతీయ సదస్సు బుధవారం హైదరాబాద్‌లోని బేగంపేటలోని ది ప్లాజాలో ప్రారంభమైంది. గోకరాజు రంగరాజు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ద్వారా హోస్ట్ చేయబడిన ఈ ఈవెంట్‌లో పరిశ్రమల ప్రముఖులు, పరిశోధకులు మరియు విద్యావేత్తలు పాల్గొన్నారు.

ఎన్టీయు సింగపూర్ నుండి ప్రొఫెసర్ లలిత్ గోయెల్ మరియు ఖతార్ విశ్వవిద్యాలయం నుండి ప్రొఫెసర్ అతిఫ్ ఇక్బాల్‌తో సహా ప్రముఖ వక్తల నేతృత్వంలోని ఆకర్షణీయమైన ట్యుటోరియల్‌లతో సమావేశం ప్రారంభమైంది. వారి ప్రదర్శనలు "ఎలక్ట్రిక్ పవర్ సిస్టమ్స్‌లో కెపాసిటీ రిలయబిలిటీ మూల్యాంకనం" మరియు "కమ్యూనిటీ ఉపయోగం కోసం ఎలక్ట్రిక్ వెహికల్ ఛార్జింగ్ స్టేషన్‌ల యొక్క ఆప్టిమల్ ప్లేస్‌మెంట్ మరియు కెపాసిటీ యొక్క సాంకేతికతలు" వంటి అంశాలను కవర్ చేశాయి.

# రొమాంటిక్ బచ్చన్



రవితేజ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'మిస్టర్ బచ్చన్'. హరీష్‌శంకర్ దర్శకుడు. ఆగస్ట్ 15న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్‌లో వేగం పెంచారు. ఈ సినిమాలోని రొమాంటిక్ మెలోడీ సాంగ్ 'జిక్కీ' ఈ నెల 2న విడుదలకానుంది. ఈ సందర్భంగా బుధవారం కొత్తపోస్టర్‌ను విడుదల చేశారు. మిక్కీ జే మేయర్ స్వరపరచిన ఈ పాట మెలోడియస్ రొమాంటిక్ నెంబర్‌గా సంగీతప్రియుల్ని మెప్పిస్తుందని, నాయకానాయికలు రవితేజ, భాగ్యశ్రీ బోర్సే మధ్య కెమిస్ట్రీ హైలైట్‌గా నిలుస్తుందని చిత్రబృందం పేర్కొంది. ఈ సినిమాలో అమితాబ్‌బచ్చన్ అభిమానిగా రవితేజ కనిపించనున్నారు. మాస్, కామెడీ, యాక్షన్ అంశాల కలబోతగా దర్శకుడు హరీష్‌శంకర్ ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారని మేకర్స్ తెలిపారు. జగపతిబాబు, సచిన్ ఖేడేకర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: మిక్కీ జే మేయర్, సహనిర్మాత: వివేక్ కూచిభొట్ల, రచన-దర్శకత్వం: హరీష్‌శంకర్.



# సినిమా కోసం గొడవపడ్డా!

'సీతారామం' 'హాయ్ నాన్న' చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు చేరువైంది మృణాల్ ఠాకూర్. ప్రస్తుతం ఈ భామ హిందీలో సైతం వరుస అవకాశాలతో దూసుకు పోతున్నది. ఆమె నటించిన 'పూజా మేరీ జాన్' అనే హిందీ చిత్రం ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలను జరుపుకుంటున్నది. దాదాపు రెండేళ్ల క్రితం షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం తన కెరీర్‌లోనే ఎంతో ప్రత్యేకమని, ఈ సినిమాలోని పాత్ర కోసం నిర్మాతలతో గొడవ కూడా పడ్డానని మృణాల్ ఠాకూర్ చెప్పింది. ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ 'ఈ సినిమాలో నా రియల్‌లైఫ్‌కు దగ్గరి సంబంధం ఉన్న పాత్రను పోషించా. ఎప్పటి నుంచో ఈ తరహా పాత్ర కోసం చూస్తున్నా. ఈ సినిమా కోసం మరొక నాయికను ఎంచుకుంటున్నారని తెలిసి నిర్మాతలతో గొడవకు దిగాను. ఆ క్యారెక్టర్ నేనే చేస్తానని ప్రాధేయపడ్డాను. ఆ పాత్ర నన్ను అంతలా ఇంప్రెస్ చేసింది. నా కెరీర్‌లో గొప్ప పాత్రగా మిగిలిపోతుంది' అని చెప్పింది. 'పూజా మేరీ జాన్' చిత్రానికి విపాషా అరవింద్ దర్శకత్వం వహించారు. త్వరలో విడుదలకు సన్నాహాలు చేస్తున్నారు.

ముందడుగు
గురువారం,
01-08-2024,
హైదరాబాద్



## శ్రీను వైట్ల పక్కా ప్లాన్.. హైప్ పెంచేస్తున్న
# గోపీచంద్ జర్నీ ఆఫ్ విశ్వం

ఈ ఏడాది భీమా సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చాడు టాలీవుడ్ మ్యాచో స్టార్ గోపీచంద్. ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద మిక్స్‌డ్ టాక్ తెచ్చుకుంది. గోపీచంద్ చాలా కాలంగా బ్లాక్ బస్టర్ హిట్ కోసం ఎదురుచూస్తున్న శ్రీను వైట్ల దర్శకత్వంలో నటిస్తున్న మూవీ Gopichand 32. విశ్వం టైటిల్‌తో వస్తోన్న ఈ మూవీ ఫస్ట్ స్ట్రైక్‌లో తెగిపడటం.. తెగించగలడం క్రమాన ఫలితం.. విధాత విశ్వం అంటూ గూస్‌బంప్స్ తెప్పించే టైటిల్ ట్రాక్ గోపీచంద్‌ను కొత్త గెటప్‌లో చూపిస్తూ సినిమాపై అంచనాలు పెంచుతోంది.

తాజాగా జర్నీ ఆఫ్ విశ్వం వీడియోను షేర్ చేశారు మేకర్స్. శ్రీను వైట్ల నుంచి ప్రేక్షకులు ఆశించే ఫన్, సీరియస్ ఎలిమెంట్స్‌తో సినిమా సాగనున్నట్టు తాజా వీడియోతో క్లారిటీ వస్తోంది.

ఈ చిత్రాన్ని చిత్రాలయం స్టూడియోస్ బ్యానర్‌పై పాపులర్ డిస్ట్రిబ్యూటర్ కమ్ ఎగ్జిబిటర్ వేణు దోనెపూడి పీపుల్ మీడియా ఫ్యాక్టరీతో కలిసి నిర్మిస్తున్నారు. గింజ గింజపై తినేవాడి పేరు రాసి ఉంటుంది. దీనిపై నా పేరు ఉంది.. అంటూ హిందీలో డైలాగ్ చెబుతూ ఇప్పటికే సినిమాపై సూపర్ హైప్ క్రియేట్ చేస్తున్నాడు గోపీచంద్.

విశ్వంలో కావ్యథాపర్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ చిత్రానికి గోపీమోహన్ స్క్రీన్ ప్లే సమకూరుస్తుండగా.. చేతన్ భరద్వాజ్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. గోపీచంద్ ఈ సారి ఫుల్ లెంగ్త్ యాక్షన్ ప్యాక్‌డ్ ఎంటర్‌టైనింగ్ రోల్‌తో రాబోతున్నట్టు ఫస్ట్ స్ట్రైక్‌తో అర్థమవుతోంది. చిత్రాలయం స్టూడియోస్ బ్యానర్‌లో వస్తున్న తొలి సినిమా ఇది.



# ఇక చాలు ఆపండి..
# ఆ హీరోయిన్‌కి దిష్టి తగులుతుంది

తెలుగు సినీ పరిశ్రమకు ఎంతో మంది కథానాయికలు వచ్చారు.. అయితే ఇందులో సక్సెస్‌ఫుల్‌గా కెరీర్ రన్ చేసే కథానాయికలు తక్కువే అని చెప్పాలి. కొందరికి టాలెంట్ లేకపోయినా అదృష్టం కలిసొచ్చి టాప్ కథానాయికల జాబితాలో చేరిపోతారు. మరికొంత మంది టాలెంట్ వున్న వారికి ఆవగింజ అంత అదృష్టం కూడా లేకపోవడంతో కొన్ని సినిమాలు చేసి కెరీర్‌కు ముగింపు చెప్పేస్తారు. అయితే ఇక్కడ అందంతో పాటు అభినయం కలిగిన కథానాయికలు కోట్లల్లో పారితోషికం తీసుకున్న వాళ్లు కూడా లేకపోలేదు. అయితే తాజాగా అందరి దృష్టి మిస్టర్ బచ్చన్ హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే మీద పడింది. మాస్ కథానాయకుడు రవితేజ, డైరెక్టర్ హరీష్‌శంకర్ కాంబినేషన్‌లో రూపొందుతున్న మాస్ ఎంటర్‌టైనర్ మిస్టర్ బచ్చన్. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఆగస్టు 15న ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే ఈ చిత్రం నుంచి ఏ ప్రమోషన్ కంటెంట్ రిలీజ్ చేసినా ఈ చిత్ర హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే స్పెషల్ ఎట్రాక్షన్‌గా నిలుస్తుంది. ఆమె డ్యాన్సులు, అందం కుర్రకారుని అమితంగా ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యంగా ఇటీవల జరిగిన మిస్టర్ బచ్చన్ టీజర్ రిలీజ్ వేడుకలో ఆమె స్టేజిపై వేసిన డ్యాన్స్ మూమెంట్స్ కుర్రకారు గుండెల్లో గిలిగింతలు పెట్టాయి. అంతేకాదు ఈ సినిమాలో ఆమె డ్యాన్స్ స్టెప్స్ కూడా అదనపు ఆకర్షణగా నిలువనున్నాయి. ఇప్పటికే ఈ చిత్రం నుంచి విడుదలైన సితార్, రెప్పల్ డప్పుల్ సాంగ్స్, టీజర్ లో తన బ్యూటీఫుల్ స్క్రీన్ ప్రజెన్స్ తో ఆడియన్స్ ని మెస్మరైజ్ చేశారు భాగ్యశ్రీ. ఇప్పుడు ఎక్కడ చూసిన భాగ్యశ్రీ ఫోటోలే వైరల్ అవుతున్నాయి. ఆమెను టాలీవుడ్ అప్ కమింగ్ క్రేజీ హీరోయిన్ అంటున్నారు. భాగ్యశ్రీ పెర్ఫార్మెన్స్ ని బిగ్ స్క్రీన్ పై చూడటానికి ఆడియన్స్ ఈగర్ గా వెయిట్ చేస్తున్నారు. ఈ సినిమా కోసం తన పాత్రకు ఆమె తెలుగులో డబ్బింగ్ చెప్పకోవడం విశేషం. అయితే ఈ కథానాయికపై అప్పడే అన్ని అంచనాలు పెంచేస్తూ.. భాగ్యశ్రీ బోర్సే మీద భారం మోపుతున్నారు. అయితే కొంత మంది మాత్రం సినిమా విడుదల వరకు ఆగండి.. ఆమె పర్‌పార్మెన్స్ డ్యాన్స్ స్టెప్స్ చూసి ఆమెను ఆకాశానికి ఎత్తుందాం.. అంతేకాని ముందునుంచే అంచనాలు పెంచేసి. .ఆమె అందాన్ని అంతలా పొగిడితే ఆమెకు దిష్టి తగిలేయదు.. అంటూ కామెంట్స్ చేస్తున్నారు.